# గనులశాఖ 'గాలి'వాటం!

- ఇనుప ఖనిజం తరలించేందుకు
- వేరే పేర్లతో ఓఎంసీ బోర్డులు ప్రత్యక్షం
- ఘనుల అక్రమాలకు రాచబాట

**అనంతపురం, డి.హీరేహాళ్, న్యూస్‌టుడే:** అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం హెచ్.ఎస్ తాండాలోని లక్షల టన్నుల ఇనుప ఖనిజం నిల్వలను తరలించేందుకు మైనింగ్‌శాఖ రాచబాటలు పరుస్తోంది. అక్రమంగా దాచిన ఖనిజాన్ని క్రమబద్ధీకరించేందుకు లోపాయికారీగా సహకారాన్ని అందిస్తోంది. హెచ్.ఎస్ తాండాలోని ఖనిజ నిల్వలను ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి చెందిన స్టాక్‌యార్డుగా పేర్కొన్న అధికారులు వాటిని తరలించటాన్ని నిషేధించారు. తాజాగా దాన్ని కర్ణాటకలోని ఎంబీటీ సంస్థకు చెందిన స్టాక్‌యార్డుగా చూపి గాలివాటంగా వ్యవహరిస్తున్నారు. నిజానికి ఆ సంస్థను కూడా ఓఎంసీ సబ్‌లీజుకు తీసుకుని నడిపిస్తోంది. స్టాక్‌యార్డులో మాత్రం వేరే పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. శుక్రవారం అక్కడ సరిహద్దు రాళ్లను పాతించి వాటికి సున్నం కొట్టించారు.

**ఎంబీటీ పేరుతో వెలసిన బోర్డు:** ఓబుళాపురం, హెచ్.సిద్ధాపురం, మలపనగుడిల్లోని 6 మైనింగు లీజులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తవ్వకాలతో పాటు తవ్విన ఖనిజాన్ని తరలించటంపై కూడా ప్రభుత్వం నిషేధం విధించింది. అందులో భాగంగానే హెచ్.ఎస్ తండాలోని స్టాక్‌యార్డు నుంచి ఖనిజం తరలిపోకుండా చర్యలు తీసుకుంది. శుక్రవారం స్టాక్‌యార్డువద్ద హఠాత్తుగా 'ఎంబీటీ, ఎం.ఎస్ మహబూబ్‌బాషా ట్రాన్స్‌పోర్టు కం, స.నెం. 3-2, 120-4. ఎ.12.45 సెంట్లు, మలపనగుడి, డి.హీరేహాళ్ మండలం' పేరుతో ఓ బోర్డు ప్రత్యక్షమైంది. కర్ణాటకలోని విఠలాపురం పరిధిలో ఎంబీటీ ఉంది. దాని పక్కనే హెచ్.ఎం మైన్స్ ఉంది. అవి రెండూ కూడా ఓఎంసీ ఆధీనంలోనే ఉన్నాయి.




ఎంబీటీ స్టాక్‌యార్డులో వెలిసిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ బోర్డు. సరిహద్దు రాళ్లకు సున్నం కొట్టిన దృశ్యం

**అ'క్రమం' ఇదీ..:** మైనింగ్‌శాఖ చెబుతున్న వివరాలు ఇవీ.. ఖనిజాన్ని నిల్వ చేసిన స్థలం ఇన్‌ఛార్జి సలీంబాషా ఇటీవల మైనింగ్‌శాఖ అధికారులను కలిశారు. అక్కడ ఉన్నదంతా కర్ణాటక సరుకని.. దాన్ని తాము తీసుకెళ్తామని మైనింగుశాఖను కోరారు. అందుకు అంగీకరించిన మైనింగ్‌శాఖ ముందుగా బోర్డు పెట్టుకోమంది. తరవాత చుట్టూ సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసుకుని సున్నం కొట్టమని సూచించింది. తరవాత వాటిని ఫొటోలు తీసుకుని.. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పింది. పైవారు సమ్మతిస్తే ఆసరకు మొత్తాన్ని తీసుకెళ్లవచ్చని సలహా ఇచ్చింది. మైనింగ్‌శాఖ అధికారులు 'గాలి'వాటంగా వ్యవహరిస్తున్నారటానికి ఇది తాజా ఉదాహరణ!